ప్రజాశక్తి

శనివారం 22 ఫిబ్రవరి 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

పని భారం... అరకొర వేతనాలు



- సమస్యల వలయంలో పారిశుధ్య కార్మికులు
- ఏళ్ల తరబడి భర్తీకాని పోస్టులు
- గోడు పట్టని పాలకులు

ప్రజాశక్తి – విజయవాడ

చాలీచాలనీ వేతనాలు, కార్మికుల కొరత, పని భారంతో విఎంసిలో తీవ్రమైన శ్రమ దోపిడీకి కార్మికులు గురవుతున్నారు. అభద్రతా వాతావరణంలో కార్మికులు పని చేస్తున్నారు. ప్రమాదాలు, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోతున్నా...నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు. మొక్కుబడి సాయంతో కార్మికుల కుటుంబాలను వదిలేస్తున్నారు. ప్రస్తుతం విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 2900 మంది ఆప్కాస్ కార్మికులు పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. వీరితోపాటు మరో ఐదు వందల మంది పర్మినెంట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరే కాకుండా సుమారు 1200 మంది డ్రైవర్లు, క్లీనర్లు వెహికల్ డిపోలో పనిచేస్తున్నారు. వాటర్, డ్రైనేజీ, వీధిదీపాలు, టౌన్‌ప్లానింగ్, ఎస్‌టిపి తదితర విభాగాల్లో 2 వేల మందికిపైగా పనిచేస్తున్నారు. అయితే 2007 తరువాత ఒక్క కార్మికుడిని కొత్తగా తీసుకున్న పరిస్థితి లేదు. దసరా, భవానీ దీక్షలు తదితర ప్రత్యేక కార్యక్రమాల సమయంలో రోజు వారీ పారిశుధ్య కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకొని, ఆ కార్యక్రమాలు ముగిసిన వెంటనే తొలగిస్తారు. రోడ్లు, ఫ్లైఓవర్లు, ప్రధాన సెంటర్లలో పెరిగిన పని భారం, నగర విస్తరణ నేపథ్యంలో ఇంకా కనీసంగా 1500 మంది పారిశుధ్య కార్మికులు అవసరమవుతారు. గత నాలుగైదు ఏళ్లుగా కౌన్సిల్ సమావేశాల్లో పార్టీలకతీతంగా కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నా...నేటికీ ఒక్క కార్మికుడిని కూడా భర్తీ చేయలేదు. 2022–23లో పలువురి (మిగతా 2లో)

ఆరుగురు చిన్నారులు డిశ్చార్జ్



మైలవరంలో చికిత్స పొందుతున్న చిన్నారులు

ప్రజాశక్తి -ఎ.కొండూరు, మైలవరం

ఎ.కొండూరు మండలం పెద్ద తండా అంగన్వాడీ ప్రీ స్కూల్లో గురువారం కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన చిన్నారుల్లో మరో ఆరుగురు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా మైలవరం ఏరియా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, పీడియాట్రిక్ డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ వాంతులు, విరోచనాలు బారినపడిన 12 మంది చిన్నారులకు మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించామన్నారు. అందులో ముగ్గురు చిన్నారులను గురువారం రాత్రి డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. మిగిలిన తొమ్మిది మందిలో ఆరుగురిని శుక్రవారం డిశ్చార్జ్ చేశామని, మిగిలిన ముగ్గురు చిన్నారులకు డీహైడ్రేషన్ ఉండటం వల్ల చికిత్స అందిస్తున్నామని చెప్పారు. అస్వస్థతకు గల కారణాలను తెలుసుకునేందుకు విజయవాడ జిజిహెచ్‌లోని మైక్రో బయాలజీ ల్యాబ్‌కు చిన్నారుల శాంపిల్స్ పంపినట్లు తెలిపారు. ఈ రిపోర్ట్స్ రావడానికి 48 నుండి 72 గంటల సమయం పట్టవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శరత్ (డిఐఓ), డాక్టర్ దివ్య, ఏఎన్‌ఎం నందిని, సిడిపిఓ జి.సత్యవతి, అంగన్వాడీ కార్యకర్తలు షేక్ ముంతాజ్ బేగం, ఎం.పద్మ పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా), గన్నవరం

ఈ నెల 27వ తేదీ జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఏలూరు రేంజ్ డిఐజి జివివి అశోక్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్‌పి గంగాధరరావుతో కలిసి పామర్రు సర్కిల్ కార్యాలయాన్ని, గన్నవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను డిఐజి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. ఆర్థిక నేరాలు కట్టడి చేయడానికి సీసీ కెమెరాలు అమర్చే విధంగా ప్రజలను చైతన్యపరచాలని, ప్రతిరోజు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని, సైబర్ నేరాల నియంత్రణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్రోన్ కెమెరాల ద్వారా ప్రతిఒక్క ప్రదేశాన్ని మోనిటర్ చేస్తూ ఎలాంటి నేరాలూ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి విక్రేతలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గన్నవరంలో విమానాశ్రయం ఉండటంతో విఐపిల తాకిడి ఎక్కువగా ఉందన్నారు. దీంతో ట్రాఫిక్



పామర్రు సర్కిల్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న డిఐజి

సిబ్బందికి తోడు లా అండ్ ఆర్డర్ సిబ్బందిని కూడా బందోబస్తుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయవాడ బైపాస్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం డ్రోన్ కెమెరాలు ఉపయోగిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్యలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ ద్వారా రాజమండ్రిలో ఇప్పటికే శిక్షణ ఇచ్చామని, త్వరలో కష్ణాజిల్లాలో కూడా ట్రాఫిక్ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోలీస్ స్థలాలను పరిశీలిస్తామని, (మిగతా 2లో)

నేటి నుండి ఉచిత పుస్తకాల పంపిణీ

రెండు రోజుల పాటు పుస్తక ప్రదర్శన



ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

ఈ నెల 22, 23 తేదీల్లో బెంజ్ సర్కిల్ వద్ద గల శ్రీ సర్వోత్తమ భవన ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, సర్వోత్తమ గ్రంథాలయం సంయుక్తంగా 9వ ఉచిత పుస్తక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సర్వోత్తమ గ్రంథాలయ కార్యదర్శి డాక్టర్ రావి శారద తెలిపారు. బెంజ్ సర్కిల్ వద్ద గల గ్రంథాలయం ప్రాంగణంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని మాజీ జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజలకు పుస్తకాలను చేరువ చేయాలనే ఆలోచనతో ఈ ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ పంపిణీ కోసం తమకు ఎందరో దాతలు పుస్తకాలను అందిస్తున్నారన్నారు. అలాగే ప్రచురణ కర్తలు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారన్నారు. ఈ ఏడాది పుస్తకాలను 30 విషయాల కింద విభజించి సామాన్యుడు సైతం సులభంగా పుస్తకాలను ఎంపిక చేసుకోవడానికి వీలు కలిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతిఒక్కరు ఈ ప్రదర్శనను సందర్శించి తమకు నచ్చిన పుస్తకాన్ని తీసుకెళ్లవచ్చని తెలిపారు.

రెడ్‌జోన్‌గా దీప్లానగర్ తండా

కోళ్ల మృతికి బర్డ్‌ఫ్లూ కారణమని నిర్ధారణ

ప్రజాశక్తి-ఎ.కొండూరు

ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం పంచాయతీ శివారు దీప్లానగర్ తండాను అధికారులు రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ఇటీవల హనుమాన్ పౌల్ట్రీ ఫారంలో మూడు వేల కోళ్లు మృతిచెందాయి. మూడు కోళ్లను వైద్య పరీక్షల నిమిత్తం భోపాల్ సెంట్రల్ ల్యాబ్‌కు పంపారు. శుక్రవారం వచ్చిన రిపోర్టు ఆధారంగా బర్డ్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారించినట్లు పశు వైద్య సంచాలకులు (ఏడిఏ) డాక్టర్ రామారావు తెలిపారు. దీప్లానగర్ సమీపంలోని కోళ్ల ఫారానికి ఒక కిలోమీటర్ పరిధిలో రెడ్‌జోన్‌గా



కోళ్ల ఫారంను పరిశీలిస్తున్న పశు సంవర్ధక శాఖ వైద్యాధికారులు

ప్రకటించినట్లు తెలిపారు. కోళ్ల ఫారాన్ని పూర్తిస్థాయిలో శానిటేషన్ నిర్వహించి, మిగిలిన కోళ్లను చంపి గోతిలో పూడ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి భరత్, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

హోటళ్ల స్వచ్ఛతా ప్రమాణాలకు గ్రీన్ లీఫ్ రేటింగ్

• లాడ్జిలు, ఇతర ఆతిథ్య సౌకర్యాలకూ ర్యాంకింగ్ వ్యవస్థ • ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ: పర్యావరణ హిత స్వచ్ఛత, పారిశుధ్యంలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ పర్యాటకులకు మధురానుభూతులు మిగిల్చే హోటళ్లు, లాడ్జిలకు ప్రభుత్వం గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వనుందని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టమ్ (ఎస్‌జీఎల్‌ఆర్‌ఎస్)పై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఆతిథ్య రంగం కీలకమైందని, స్థానిక సమాజం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుత పర్యాటకంలో భాగంగా ఆతిథ్య రంగంలో సురక్షిత పారిశుధ్య నిర్వహణను ప్రోత్సహించేందుకు గ్రీన్ లీఫ్ రేటింగ్ వ్యవస్థను ఆవిష్కరించినట్లు వివరించారు. హోటళ్లు, లాడ్జీలు, హోమ్‌స్టేలు, ధర్మస్థలాలు తదితర ఆతిథ్య సౌకర్యాలకు గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వడం జరుగుతుందని.. వన్ లీఫ్ రేటింగ్ పొందాలంటే ఘన వ్యర్థాలు, మానవ వ్యర్థాలు, మురుగునీటి నిర్వహణలో 100-130 మార్కులు రావాలని, అదే విధంగా త్రీ లీఫ్ రేటింగ్‌కు 130-180 మార్కులు, ఫైవ్ లీఫ్ రేటింగ్‌కు 180-200 మార్కులు



సాధించాల్సి ఉంటుందని వివరించారు. రేటింగ్‌కు సిఫార్సు చేసేందుకు వీలుగా జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్ కన్వీనర్‌గా, జిల్లా పర్యాటక అధికారి సభ్య కార్యదర్శిగా కమిటీ ఉంటుందని, అదేవిధంగా డివిజన్ స్థాయిలో ఆర్‌డీవో ఛైర్మన్‌గా వెరిఫికేషన్ ఉప కమిటీ ఉంటుందని తెలిపారు. ముందుగా హెూటళ్లు, లాడ్జీలు తదితరాలను స్వచ్ఛ భారత్ అభియాన్ (గ్రామీణ్) వెబ్‌సైట్ ద్వారా మ్యాపింగ్ చేయాల్సి ఉందని, ఆయా యాజమాన్యాలకు డివిజన్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రేటింగ్ వ్యవస్థ గురించి వివరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయిలోనూ వర్క్‌షాప్‌లతో పాటు శిక్షణ కార్యక్రమాలపైనా దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది అక్టోబర్ 2 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా కనీసం వెయ్యి ఆతిథ్య లొకేషన్లకు ర్యాంకింగ్స్ ఇవ్వాల్సి ఉందని.. ఈ నేపథ్యంలో జిల్లాస్థాయిలో ర్యాంకింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ రేటింగ్స్ వల్ల పర్యాటకులతో పాటు ఆయా హెూటళ్ల యాజమాన్యాలకు ప్రయోజనం ఉంటుందని, అమరావతికి గేట్ వే వంటి విజయవాడలో ఎక్కువ హోటళ్లు, లాడ్జిలు మంచి గ్రీన్ లీఫ్ రేటింగ్ సాధించి, పర్యాటకం పరంగా, ఆతిథ్యం పరంగా జిల్లాను ముందునిలిపేందుకు భాగస్వామ్య పక్షాలు కషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా ఎస్‌ఈ ఎస్.విద్యాసాగర్, జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్‌వీ స్వామి, ఏపీ టీడీసీ డివిజనల్ మేనేజర్ చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, గ్రామవార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీపీవో పి.లావణ్య కుమారి, జిల్లా టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధి టి.రవికుమార్ పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

పని భారం... అరకొర వేతనాలు

సిఫార్సులతో 150 మంది కార్మికులను తీసుకున్నారు. అయితే వారు ఎక్కడెక్కడ పని చేస్తున్నారో నేటికీ తెలియని పరిస్థితి నెలకొంది. నగరంలో రోజుకు 700 నుంచి 800 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. దీనిని సింగ్‌నగర్, ఆటోనగర్ డంపింగ్ యార్డుల నుంచి లక్షల రూపాయలు వ్యయం చేస్తూ టెన్‌టైర్ల లారీల ద్వారా గుంటూరు జిల్లా చిలకలూరిపేట వద్ద ఉన్న జిందాల్ కంపెనీకి తరలిస్తున్నారు. ప్రస్తుతం మైక్రో ప్యాకెట్స్‌కు మున్సిపల్ నిబంధనల ప్రకారం మూడున్నర మంది కార్మికులను కేటాయించాలి. కానీ కేవలం ముగ్గురు కార్మికులతో పని చేయిస్తున్నారు. కానీ వాస్తవంగా పెరిగిన పని భారం ఆధారంగా నలుగురు కార్మికులు అవసరమని కార్మికులు, కార్మిక సంఘాలు చెబుతున్నాయి. స్వీపింగ్, సైడ్ డ్రైన్ల క్లీనింగ్, డోర్ టు డోర్ కలెక్షన్, పోగులెత్తడం ప్రధానంగా నాలుగు రకాల పనులు కార్మికులు పని చేయాల్సి వస్తోంది. దీంతో పని భారం పెరిగింది. ఉదాహరణకు కృష్ణలంక 22వ డివిజన్ సత్యంగారి హోటల్ సెంటర్ నుంచి రైల్వే లో-బ్రిడ్జి వరకు 115 మంది కార్మికులు గతంలోనే పని చేశారు. ప్రస్తుతం కేవలం 35 నుంచి 40 మంది వరకే పరిచేస్తున్నారు. కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్, సింగ్‌నగర్ 58వ డివిజన్ నగరంలోనే పెద్ద శానిటరీ డివిజన్లు. కానీ ఈ రెండు డివిజన్లలో కూడా కార్మికులు రోజు రోజుకూ తగ్గిపోతూ సగం మంది మాత్రమే పని చేస్తున్నారు. ఈ ఆటంకాల నడుమ కార్మికులు, వాహనాలు, సదుపాయాలు... ఇలా అన్నీ కొరతగానే ఉన్నా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

ఆ స్థలాలను ఏ విధంగా ఉపయోగించాలనే దానిపై నివేదిక తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో డిఎస్‌పి చలసాని శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ సిఐ శివప్రసాద్, గుడివాడ డిఎస్‌పి వి.ధీరజ్ వినీల్, పామర్రు ఇన్స్పెక్టర్ శుభకర్, సిఐ పెద్దిరాజు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్ లక్ష్యాలపై దృష్టి

ప్రజాశక్తి-విజయవాడ: పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద రిజిస్ట్రేషన్లతో పాటు సౌర ఫలకాల ఏర్పాటు (ఇన్‌స్టలేషన్)పై ప్రతి మండలానికి నిర్దేశించిన లక్ష్యాలపై అధికారులు దష్టిసారించాలని, పథకం అమలు పురోగతిపై ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో పీఎం సూర్యఘర్ పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్లతో పాటు ఇన్‌స్టలేషన్స్‌పైనా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు కరెంటు బిల్లుల భారాన్ని తప్పించేందుకు, పర్యావరణ పరిరక్షణకు, పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగానికి వీలుకల్పించే ఈ పథకాన్ని ఇంటింటికీ చేర్చేందుకు కషిచేయాలని, జిల్లాలోని ఏడు లక్షల విద్యుత్ సర్వీసుల్లో కనీసం రెండు లక్షల ఇళ్లకు సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వడాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్న నేపథ్యంలో విద్యుత్, గ్రామీణాభివద్ధి విభాగాల అధికారులు, బ్యాంకర్లు, వెండర్లు.. ఇలా వివిధ భాగస్వామ్య పక్షాలు సమష్టిగా కషిచేయాల్సిన అవసరముందన్నారు.

డ్రైనేజీ పంపింగ్ స్టేషన్‌ను అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి-విజయవాడ

హెచ్‌బి కాలనీలోని డ్రైనేజీ పంపింగ్ స్టేషన్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఐరన్ యార్డ్, ఎట్కిన్సన్ స్కూల్ రోడ్, ఊర్మిళ సుబ్బారావు రోడ్, జోజి నగర్, గొల్లపూడి బైపాస్ రోడ్, సితార రోడ్, హెచ్ బి కాలనీ, సివిఆర్ ఫ్లైఓవర్, న్యూ భగత్ సింగ్ నగర్, బ్రహ్మయ్య స్ట్రీట్, ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హెచ్‌బి కాలనీలోని డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ సత్వరమే మరమ్మతులు చేయించి, త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిత్యం సైడ్ డ్రైన్లను పరిశుభ్రపరుస్తుండాలని, ఖాళీ స్థలాలలో ఎటువంటి వ్యర్థాలు నీటి నిల్వలు ఉండరాదని, కల్వర్టు పాడైపోయినవన్నీ మరమ్మతులు చేయించాలని అధికాలను ఆదేశించారు. ఔట్ ఫాల్ డ్రైన్ లను పరిశీలించి ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ ప్రక్రియను చేస్తూ ఉండాలని అవసరమైన చోట రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర రెడ్డి, శివ రాంప్రసాద్, ఓబేశ్వరరావు పాల్గొన్నారు.






హరీష్‌ను అభినందిస్తున్న దృశ్యం

హరీష్‌కు పలువురు అభినందనలు

ప్రజాశక్తి-గన్నవరం : ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా కోశాధికారిగా గన్నవరం ఉపఖజానా కార్యాల యంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న తాళ్లూరి హరీష్ ఏకగ్రీవంగా ఎన్నిక అవడం పట్ల ఉద్యోగులు శుక్రవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గన్నవరం తాలూకా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు దామెర సీతారామయ్య, ఉప ఖజానా అధికారి తిలారి. నాగరాజు, మంద్రు రవి , దమ్ము .విజయ్ కుమార్, పంపానా వెంకట కిషోర్, హరీష్‌ని సన్మానించారు.

కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హెచ్ఐవి రోగులకు కంటి పరీక్షలు చికిత్సలు విజయవంతంగా ముగిశాయి. ఆపరేషన్ తర్వాత రోగులకు కళ్లజోళ్ళు మందులు పంపిణీ చేశారు. ఇందులో ప్రభుత్వ సర్వజన వైద్యశాల పర్యవేక్షణ అధికారి డాక్టర్ ఆశాలత, వైద్యవిభాగాధిపతి డాక్టర్ జి భానుమూర్తి పాల్గొని హెచ్ఐవి రోగులకు జాగ్రత్తలు ధైర్యం చెప్పారు. మచిలీపట్నం సర్వజన వైద్యశాలలో మొట్ట మొదటిసారిగా హెచ్ఐవి రోగులకు నేత్ర శాస్త్ర చికిత్సలు ప్రారంభం అయిన సంగతి అందరికీ విధితమే. శుక్రవారం ఆపరేషన్లు చేయించుకున్న వారి సంఖ్య 19కి పెరిగింది.



సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-పమిడిముక్కల : గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ బకాయిలు వెంటనే విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రంథాలయ సంఘం అధ్యక్షులు కృపానందం కలెక్టర్ డికె బాలాజీని కోరారు. శుక్రవారం పమిడిముక్కల మండలంలోని గ్రంథాలయ ఉద్యోగులు మచిలీపట్నంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల గ్రంథాలయ శాఖ కార్యదర్శి షరీఫ్, మేడూరు గ్రంథాలయ శాఖ కార్యదర్శి సుబ్రహ్మణ్యం,కోగంటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలం లంకపల్లి గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్త సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్ల పనితీరును కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వద్ద నుంచి చెత్తను సేకరించే సమయంలోనే గ్రీన్ అంబాసిడర్లు తడి పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని సూచించారు. ప్రజలు తడి పొడి చెత్తను కలిపి ఇస్తే వారి ఇంటి వద్ద తారుబల్ల వేసి తడి పొడి చెత్తను ఎలా వేరు చేయాలో వారికి అవగాహన కల్పించి గ్రీన్ అంబాసిడర్లకు అందించేలా ప్రోత్సాహించాలన్నారు. ప్రజలు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే పరిసరాల పరిశుభ్రత – స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ – స్వచ్ఛ దివాస్ సాధ్యమని జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఈఓపిఆర్డి కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.నాగ నాంచారమ్మ, కె.పద్మారావు, ఎఫ్ఏ, వై.దుర్గా ప్రసాద్, గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్ మిత్రాలు, పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



తడి,పొడి చెత్త పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఉంగుటూరు : విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే కష్టపడేతత్వం అలవరుచుకోవాలని ఉంగుటూరు ఎంఆర్ఓ జాలాది విమలా కుమారి అన్నారు. మండలంలోని తేలప్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో స్వర్ణశిల్పి పెట్ల సత్యనారాయణమూర్తి, పెట్ల లక్ష్మీనరసమ్మ జ్ఞాపకార్థం వారి వారసులు పెట్ల కామేశ్వరరావు తదితరుల సహకారంతో గత 18 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్నారు. దానిలో భాగంగా శుక్రవారం తేలప్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు 1వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థుల వరకు ప్రతి తరగతికి ప్రథమ బహుమతి 5గురికి, ద్వితీయ బహుమతి 5గురు 125 మంది విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేలూరి వెంకట ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రొఫెసర్ అండ్ డీన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్ట్మెంట్ (జె ఎన్ టి యు) డాక్టర్ గుర్రం సాగర్, గ్రామ పంచాయతీ సర్పంచ్ లాం ధిభోరా, శాతవాహన కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఉయ్యూరు సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



8వ రోజు కొనసాగిన నిరసన

ప్రజాశక్తి ఉయ్యూరు : కేంద్ర కార్యాలయ సర్క్యులర్లు వ్యతిరేకంగా, డిపో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు వివిధ రూపాల్లో ఉద్యమం చేస్తున్నా ఆర్టీసీ యాజమా న్యం పట్టనట్టు వ్యవహరిస్తుందని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కా ర్యదర్శి రావి సుబ్బారావు ఆందోళన వ్యక్తంచేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా చేసిన చార్జ్ కౌన్సిలింగ్ రద్దుచేసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంఈ యూ ఆధ్వర్యంలో 8వ రోజు ఉద్యోగుల దీక్షను శుక్రవారం సుబ్బారావు ప్రారంభించారు. చార్జ్ కౌన్సి లింగ్ రద్దు చేయాలని కోరుతున్న 60 మంది డ్రైవర్లు, కండక్టర్ల వినతులను పరిగ ణలోకి తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా నోటీసుబోర్డు మార్పిన వారిపై చర్య లు తీసుకోవాలని, అక్రమ చార్జిషీట్లు పనిష్మెంట్లు రద్దు చేయాలని, 1/19సర్కు లర్ అ మలు చేయాలని డిపో అధ్యక్షుడు పీఎం కృష్ణ డిమాండ్ చేశారు. కేఎర్రావు, టీవీఆర్ ప్రసాద్ దీక్షలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా జాయింట్ సెక్రటరీ సురేశ్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ మల్లేశ్వరనాయక్, ఆటో నగర్ డిపో కార్యదర్శి ఎంఎన్ రావు, హుస్సేన్, నాగయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి రాంబాబు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు.



సర్టిఫికెట్లు అందించిన దృశ్యం

సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-ఘంటసాల : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల నందు సమగ్ర పోషక యాజమాన్యం పై పదిహేను రోజుల సర్టిఫికెట్ కోర్సు విజయవంతంగా పూర్తిచేసుకున్న సహకార సంఘ ప్రతినిధులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. కేవికే ప్రాంగణంలో కేవికే సమన్వయ కర్త డా. డి. సుధా రాణి ఆధ్వర్యంలో కోర్సు ఇన్చార్జి సస్యరక్షణ శాస్త్రవేత్త డా. రేవతి కోర్సు ధ్రువ పత్రా లను అందించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. మంజు వాణి, యశ్వంత్ కుమార్, డా. వెంకట లక్ష్మీ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - గుడివాడ : గంజాయి అక్రమంగా కొనుగోలు చేసినా అలాగే అమ్మకాలు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ రూరల్ ఇన్చార్జి సి.ఐ కె శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తాలుకా పోలీసు స్టేషన్‌లో ఎస్.ఐ చంటిబాబుతో కలసి రూరల్ ఇన్చార్జి సి.ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన తాలుకా ఎస్ఐ చంటిబాబుకు వచ్చిన సమాచారం మేరకు రూరల్ మండలంలోని లింగవరం రోడ్డులో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 1.7 కేజీల గంజాయిని తరలిస్తుండగా తహశీల్దార్ రామకోటేశ్వరరావు సమక్షంలో నందం సూర్య, పులివర్తి రోహిత్, బండి తంబిలు ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో వ్యక్తి రాజా వెంకట్ తప్పించుకున్నట్లు తెలిపారు. ఈ గంజాయిని కళాశాల వద్ద విద్యార్థులకు అమ్మకాలు నిర్వహించేందుకు ఆటోలో వెళ తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలుకా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కరెంటు వైర్లు చోరీ

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్(గన్నవరం) : బాపులపాడు మండలం, రంగన్నగూడెం, వీరవల్లి గ్రామ ఆయకట్టులో 30 మంది రైతుల వ్యవసాయ పంపుసెట్లవద్ద ఉన్న సబ్ మెర్సిబుల్ కేబుళ్ళు దొంగలు దొంగిలించారు. రంగన్నగూడెం గ్రామ ప్రముఖులు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ గోపాలకృష్ణారావుకు చెందిన వ్యవసాయ పంపుసెట్టు దగ్గర వున్న లక్ష విలువైన సామగ్రి శుక్రవారం తెల్లవారుజామున ఎత్తుకు పోయారు. షెడ్డు తాళాలను అధునాతన పరికరాలతో కట్ చేసి షెడ్ లో ఉన్న రెండు లైవాన్ స్ప్రేయర్లు, సబ్ మెర్సిబుల్ కేబుల్ 300 మీటర్లు, పామాయిల్ తోటకు ఉపయోగించే 5 లీటర్ల 6 కలుపు మందు డబ్బాలు, పామాయిల్ గెలలు పొడిచే 4 అలుగులు వస్తువులను ఎత్తుకెళ్లి భీభత్సం సృష్టించారు. అదే రాత్రి గ్రామంలోని ఆళ్ళ శివశంకరరావు, పుసులూరి పూర్ణ వెంకట ప్రసాద్ వ్యవసాయ పంపుసెట్ల దగ్గర కూడా తాళాలు పగులగొట్టి కలుపు మందు డబ్బాలను సబ్ మెర్సిబుల్ కేబుళ్ళను దొంగలు ఎత్తుకెళ్ళారు. దీనితో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ సంఘటనల మీద వీరవల్లి పోలీసులకు రైతులు వరుస ఫిర్యాదులు చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవటంలేదని రైతులు వాపోతున్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి



ప్రజాశక్తి-విజయవాడ : గ్యాస్ బండ్ల లోడు లారీ ఢీకొనడంతో ఒక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శుక్రవారం స్థానిక కృష్ణ లంక ఎం-హోటల్ సమీప చైతన్య స్కూల్ వద్ద చోటు చేసుకుంది. మృతురాలు కుమారుడు తెలిపిన వివరాల ప్రకారం రాణిగారితోట నివాసి షేక్ ఆషాబి (70) ఆకుకూరలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. ఈమె ప్రతి రోజు మాదిరిగానే శుక్రవారం తన నివాసం నుంచి ఎంహోటల్ సమీప చైతన్య స్కూల్ వద్దకు చేరుకున్న ఈమెను గ్యాస్‌బండ్ల లోడు లారీ వేగంగా వస్తూ ఢీకొట్టింది. దీంతో ఆషాబి అక్కడికక్కడే మృతి చెందింది. కేసును కృష్ణలంక పోలీసులు నమోదు చేసి విచారిస్తున్నారు.

పలుచోట్ల రీసర్వే పనుల తనిఖీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : జబర్లపూడిలో జరుగుతున్న భూమి రీసర్వేపనులను ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎస్ నాగేశ్వర రావు శుక్రవారం తనిఖీచేశారు. మండలంలో జబర్లపూడి పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపిక చేసి రీ సర్వే పనులు చేస్తున్న నేపథ్యంలో ఆయన తనిఖీచేశారు. ఇప్పటి వర కు జరిగిన పనులను మండల రీసర్వే డీటీ వెంకటేశ్వరరావు వివరించారు. మండల సర్వేయర్ దగాని సురేష్ బాబు, వీఆర్వో లోకేశ్వరరావు, గ్రామ కార్యదర్శి రవితేజ పాల్గొ న్నారు.ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూముల రీ సర్వే కార్యక్రమం ను శుక్ర వారం అధికారులు పరిశీలించారు. గన్నవరం మండలం, కేసరపల్లి శివారు వెంకట నరసింహ పురం గ్రామ సరిహద్దులు, భౌగోళిక సత్య నిర్ధారణ (గ్రౌండ్ ట్రుతింగ్) నిర్వహించినట్లు తహసీల్దార్ శివయ్య తెలిపారు. గ్రామం మొత్తం విస్తీర్ణం: 620.16 ఎకరాలుండగా ప్రభుత్వ భూమి 72.04 ఎకరాలు, పట్టా భూమి 548.12 ఎకరాలు మొత్తం రైతుల సంఖ్య: 449 మంది ఉన్నారు. ఈ రీ సర్వే కార్యక్రమంలో రాష్ట్ర సర్వే ల్యాండ్ రికార్డ్స్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.వి.ఎస్.ఎన్. కుమార్, గుడివాడ ఆర్డీఓ జి.బాల సుబ్రహ్మణ్యం, గుడివాడ డీఐఎస్ సిహెచ్ నరసింహారావులు రీసర్వే తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. రీ సర్వే సమయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనప్పటికీ, రైతులు గన్నవరం తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని తహసీల్దార్ సూచించారు.



ఉయ్యూరులో...



గన్నవరంలో...



మాతృ భాషా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - వన్ టౌన్ : స్థానికి కెయల్ రావు నగర్ రాకేష్ పబ్లిక్ స్కూల్ నందు అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ వి రావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సమారుగా 42 మంది పిల్లలు తమ ప్రతిభను చూపుతూ పద్యాలను ఆలపించి వాటి అర్థాలను వివరించారు. అందులో ప్రతిభ కలిగిన ఆరుగురు విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, (బ్రాంజ్ మెడల్స్‌ను) బహూకరించారు. ఈ సందర్భముగా డైరెక్టర్ ఎన్ వి రావు మాట్లాడుతూ. మాతభాషా అయిన తెలుగులో విద్యార్థులకు మరింత ప్రావీణ్యం సాధించడం ద్వారా అన్ని భాషాలను సలభంగా నేర్చుకోవచ్చని అన్నారు. అలాగే వచ్చే సంవత్సరం ఉర్దు మాతృ భాష కలిగిన విద్యాంసులు మనవద్ద ఉన్నారని వారు కూడా భాషను నేర్చుకోని అందులో ఉన్న గొప్పతనాన్ని కూడా ఇతరులకు తెలియ చేయాలన్నారు. రమేష్ , ఈ ప్రోగ్రాం కన్వీనర్ ఎస్ కె షకీలా తదితరులు పాల్గొన్నారు.



చోరీ చేసిన ఇళ్లను పరిశీలిస్తున్న సిఐ వైవిఎల్ నాయుడు

రెండు ఇళ్లల్లో చోరీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో నెహ్రూ నగర్‌లో బండారు భోగేశ్వరరావు ఇంట్లో, శుక్రవారం 11 గంటలకు బీసీ హాస్టల్ ఎదురుగా 2 ఇండ్లలో పట్టపగలే రెండు ఇళ్లల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు రెక్కీ నిర్వహించి లోపలికి ప్రవేశించి ఇనుప రాడ్లతో తలుపులు పగలగొట్టి బంగారం నగదు చోరీకి గురి పాల్పడ్డారు. రెండు ఇళ్లల్లో ఇంటి యజమానులు లేని సమయంలో రెక్కీ నిర్వహించిన దొంగలు 50 గ్రాములు బంగారం, రూ.30 వేల నగదును చోరీకి పాల్పడినట్లుగా బాధితులు వాపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలము వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారంగా ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజ్ ని పరిశీలించారు. దొంగతనంతో పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారని పట్టణంలో అన్ని ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా నిర్వహించాలని బాధితులు కోరుతున్నారు.

సివిల్, క్రిమినల్ కేసులు కోర్టులో పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : 18 సంవత్సరాల లోపు పిల్లలకు బైకు నడపకూడదని అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి మైల బత్తుల శోభారాణి అన్నారు. మండలంలోని చిల్లకల్లు గ్రామంలో పాస్టర్ ప్రతాపరెడ్డి చర్చిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రో నోటు కేసులో అప్పు తీసుకునే వ్యక్తి కాళీ నోటును పూర్తిగా పూర్తి చేసిన తర్వాతనే డబ్బులు తీసుకొని సంతకం చేయాలని అన్నారు. కాళీ నోట్లుపై సంతకాలు చేస్తే ఇరుకున పడతారని తెలిపారు. ప్రతి ఇంట్లో మోటార్ సైకిల్ నేడు ఉంటున్నాయని ప్రతి వ్యక్తి హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అన్నారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకి వాహనాలు నడపకూడదని వాహనం ఇచ్చిన తండ్రిపై నడిపిన వాహనదారుడుపై కూడా కేసు నమోదవుతుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నెపాగ సుందర రావు, ప్రసాదు, కోశాధికారి అంజనేయులు, గోనెల వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరావు, కరిసే రత్నబాబు, నరేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా సిసి రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - భవానీ పురం : మిల్క్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న సి వి ఆర్ పై ఓవర్ బ్రిడ్జి కి పడమరవైపు అపార్ట్మెంట్స్ వాసులకు ఇకనుండి రాజమార్గమే.. ఇటీవలే రూ 44 లక్షల 35 వేల వ్యయంతో పక్కా సి సి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన విషయం తెల్సిందే. ప్రస్తుతం డ్రైనేజీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మార్చి నెల కల్లా సిసి రోడ్డు పూర్తి స్థాయిలో రూపుదిద్దుకొంటోంది. ఈ క్రమంలో ఇక్కడ అభివృద్ది పనులను భుజాన వేసుకున్న రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, విజయవాడ రూరల్ ఏ ఈ నందమూరి శివరామకృష్ణ శుక్రవారం ఉదయం అభివృద్ది పనులు తీరును స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బొమ్మసాని సుబ్బారావు స్థానిక విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానం చెబుతూ.. అపార్ట్మెంట్ వసూలకు మరో శుభవార్త చెప్పారు. ఇప్పటి వరకు ప్రధాన మార్గంలో మాత్రమే సి సి రోడ్డు వేస్తున్నట్లు చెప్పుకొంటూ వచ్చిన ఆయన అస్త్ర అపార్ట్మెంట్, విష్ణుప్రియ హైట్స్ అపార్ట్మెంట్స్‌కి తూర్పు ముఖంగా ఉన్న రోడ్డు కూడా



పక్కా సి సి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు బొమ్మసాని సుబ్బారావు ప్రకటించారు. అంతే గాకుండా ఈ ప్రాంతంలో ఉన్న అన్ని అపార్ట్మెంట్ వాసులకు తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా కృష్ణా నది నుండి తాగునీరు అందించే ప్రక్రియ త్వరలోనే మొదలౌతుందని సుబ్బారావు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలుత వీధి దీపాలు, తదుపరి సిసి రోడ్లు, ఇంకొన్నాళ్ల లో తాగునీటి సౌకర్యం కల్పించడం తమ అదృష్టమని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు ఏర్పాట్లు నామమాత్రం

ప్రజాశక్తి - నందిగామ : ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు నందిగామ డివిజన్ పరిధిలో అధికారుల ఏర్పాట్లు నామమాత్రంగా చేస్తున్నారు. ఈనెల 27వ తేదీన పోలింగ్ జరుగుతుంది. నందిగామ జగ్గయ్యపేట నియోజకవర్గం పరిధిలో ఏడు మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలను సహాయ కలెక్టర్ శుభం నొక్వాల్, నందిగామ ఆర్‌డిఒ బాలకృష్ణ పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు నందిగామ డివిజన్ పరిధిలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు నందిగామ ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి అధికారులకు శిక్షణ ఇచ్చారు. నందిగామ నియోజవర్గంలో 12, జగ్గయ్యపేట నియోజకవర్గంలో 10 చొప్పున పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. కేవలం మండల కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాలుంటాయి. ఆయా మండల ఓటర్లు మండల కేంద్రంలోని పోలింగ్ బూత్ వేయవలసి ఉంటుంది. పోటీలో 25 మంది అభ్యర్థులు ఉన్నారు. ప్రధానంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు, కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీలో ఉన్నారు. నందిగా నియోజవర్గంలో నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు పోలింగ్ బూత్‌లు చందర్లపాడు జడ్పీ స్కూల్లో రెండు కంచికచర్ల జడ్పీ స్కూల్లో మూడు ఏర్పడు జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట నియోజవర్గంలో జగ్గయ్యపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 6, పెనుగంచిప్రోలు జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు వత్సవాయి జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలాల వారీగా ఎంఎల్‌సి గ్రాడ్యుయేట్ ఓటర్ల వివరాలు నందిగామ నియోజవర్గంలో పురుషులు 5,468 మహిళలు 3490 మొత్తం 8958. జగ్గయ్యపేట నియోజకవర్గంలో పురుషులు 4171 మహిళలు 2804 మొత్తం 6975 మంది.



సెక్రెటరీలతో సమీక్ష చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి

సెక్రెటరీలతో మున్సిపల్ చైర్మన్ సమీక్ష

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పురపాలక సంఘ కార్యాలయంలో నందిగామ నియోజకవర్గ శాసన సభ్యురాలు, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆదేశాల మేరకు వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలతో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలలో మిడ్ డే మీల్స్‌ను వారానికి రెండుసార్లు తప్పనిసరిగా పర్యవేక్షించవలసిందిగా మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించవలసిందిగా ఆదేశించారు. పాఠశాల ఆవరణ, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచాలని, సచివాలయంలో ఉన్న సేవల గురించి ప్రజలకు తెలియచేసి వారు ఇచ్చిన అర్జీలను వెంటనే కన్సర్న్ డిపార్ట్మెంటుకు పంపించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం

ప్రజాశక్తి - నందిగామ : రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా పశుగణాభివృద్ది సంస్థ ఆంధ్రప్రదేశ్ వారి సౌజన్యంతో డిడి. డాక్టర్ మోసెస్ వెస్లీ వారి ఆధ్వర్యంలో చందర్లపాడు మండలం ఏటూరు గ్రామంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిడి. మోసెస్ వెస్లీ రైతులకు అవగాహన కల్పించారు. గన్నవరం డి.యల్.డి.ఓ., ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్. శ్రీనివాసు మాట్లాడుతూ రైతులకు సెక్స్ స్టార్టెడ్ సెమన్ (ఒంగోలు జాతి కోడె దూడలు) గురించి తెలిపారు. ఈ పశు వైద్య శిబిరంలో 50 పశువులకు ఉచితంగా చికిత్సలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎడి. డాక్టర్ వెంకటరావు, వి.ఎ.యస్. లు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ప్రదీప్ చంద్ర, డాక్టర్. సుమంత్ రెడ్డి గ్రామ పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - నందిగామ : జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ ఎన్ఎంఎంఎస్‌కి ఎంపికైన ఐతవరం వసంత జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులను మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలకు చెందిన 8 వ తరగతి చిన్నారులు బెల్లంకొండ జయ శ్రీలక్ష్మి , జినమొని వికాస్ కుమార్ , యార్లగడ్డ భార్గవ్ ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన దరిమిలా పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో నందిగామ మండల టిడిపి అధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బండారు లక్ష్మీనారాయణ, ఎస్ఎంఎస్ చైర్మన్ బెల్లంకొండ అమరయ్య, గ్రామ పెద్దలు తొగటి హనుమయ్య, మద్దుకూరు రామారావు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - మైలవరం : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని స్థానిక లీలావతి గిరిజన పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడత లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పసిపిల్లలు మొదటగా నేర్చుకునేది మాతృభాషా అని అన్నారు. భారతదేశంలోని భాషలన్నింటిలో తెలుగుకు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు వివిధ వేషధారణలో పద్యాలు శ్లోకాలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

ప్రజాశక్తి - గంపలగూడెం: గ్రామానికి చెందిన పెద్దకమళ్ళ హరికృష్ణ తనపై దాడి చేసి గాయపరిచాడని, స్థానిక పోలీస్ స్టేషన్లో అదే గ్రామానికి చెందిన రావుల నాగరాజు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐఎస్ శ్రీనివాస్ తెలిపారు. తన ఇంట్లోకి ఇటీవల అక్రమంగా ప్రవేశించి, ఒకసారిగా దాడికి పాల్పడినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. ఈ విషయమై హరికృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి - గంపలగూడెం: మండలంలో ఉమ్మడి దేవరపల్లి గ్రామానికి చెందిన కంపల్లి రాము తన భార్య కనిపించడం లేదని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 10వ తేదీ రాత్రి తమ ఇంట్లో కుటుంబ సభ్యులందరూ, నిద్రించామని, తెల్లవారుజామున చూస్తే తన కూతురు శ్రావణి కనిపించలేదని చెప్పారు. ఈ విషయమై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ వివరించారు.

పరస్పర దాడుల్లో రెండు కేసులు

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని పెనుగొలను గ్రామంలో ఇంటిముందు కాలువ నీటి ప్రవాహం విషయమై పడిన గొడవ కేసులో ఇరువర్గాల నుండి వచ్చిన ఫిర్యాదులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామానికి చెందిన శాలి సంధ్య, రామాల అరుణలు గొడవ పడి ఒకరు పై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై వేరువేరు ఫిర్యాదులు అందగా, కేసులు నమోదు అయినట్లు వివరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - వత్సవాయి : శనివారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడానికి, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం కింద పేర్కొన్న ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు చెప్పారు. పోలీస్ స్టేషన్ సెంటర్, ఎన్టీఆర్ బొమ్మ, అమ్మవారి టెంపుల్ వెనకాల, పాత పోస్ట్ ఆఫీస్ బజార్ ప్రాంత వాసులు గమనించి సహకరించాలని కోరారు.

అనుమానాస్పదంగా ఒకరు మృతి

ప్రజాశక్తి - మైలవరం : అనుమానాస్పద రీతిలో ఒకరు మృతి చెందిన సంఘటన మైలవరం శివారు దర్గా సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ప్రకారం మైలవరానికి చెందిన ఎస్‌కె మీరావలి (45) స్థానికంగా ఉన్న ఐస్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. శుక్రవారం మధ్యాహ్నం దర్గా సమీపంలో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి సిఐ చంద్రశేఖర్, ఎస్ఐ సుధాకర్లు చేరుకొని వివరాలు సేకరించారు. మృతునిభార్య షరీఫా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చల్లపల్లి మండలంలో...



తోట్లవల్లూరు మండలంలో...

లక్ష్మణరావును గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి-చల్లపల్లి : పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు గెలిస్తేనే ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సాధ్యపడుతుందని సిఐటియు కష్ణాజిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల నాయకులు చల్లపల్లి మండలంలోని ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కర్విముల్లా, మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు బండారు కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మేడేపల్లి వెంకటేశ్వరరావు ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు** : మండలంలోని పెద్ద ఆవుటపల్లి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజ్మీరా వెంకటేశ్వరరావు పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి క్షణం ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా, ప్రతి ఒక్కరి సమస్య తన బాధ్యత గా భావించి ప్రభుత్వం పై నిరంతరం పోరాటం చేస్తున్న కెఎస్ లక్ష్మణరావు గెలుపుకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు, పిల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి (మొవ్వ)** : మొవ్వ మండల కేంద్రంలో కెఎస్ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల నాయకులు విస్తతంగా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాగోలు రమేష్ బాబు, సిఐటియు మండల కార్యదర్శి చిగురుపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు **ప్రజాశక్తి - గుడివాడ :** పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు గెలిస్తేనే ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సాధ్యపడుతుందని సిఐటియు కష్ణాజిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల నాయకులు గుడివాడ ఏరియా ఆసుపత్రిలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, కొండా, సురేంద్ర, విజయ్ కుమార్, యెషయ్య, తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-మోపిదేవి** : మోపిదేవి మండలంలో ప్రజాసంఘాల నాయకులు విస్తత ప్రచారం చేపట్టారు. మోపిదేవి వార్పుకాలనీ, ఏరియాలలో మండల సిఐటియు కార్యదర్శి సిరివెళ్ల రాజశేఖర్, మోపిదేవి మండల కౌలు రైతు సంఘం నాయకులు మరీదు సురేష్ బాబు, మండల కమిటీ సభ్యులు బెజవాడ నాగేశ్వరరావు, రామారావు కొమ్ము జయ, పులివర్తి నాగమల్లేశ్వరరావు తదితరులు నమూనా బ్యాలెట్ పేపర్ చూపించి 23 దగ్గర కెఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు ఒకటి వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు.**ప్రజాశక్తి-తోట్లవల్లూరు** : కె. ఎస్.లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం దేవరపల్లి హై స్కూల్ ఉపాధ్యాయులను ప్రజాసంఘాల నాయకులు కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం సచివాలయంలో సిబ్బందిని, పెనమకూరు జిల్లా పరిషత్ హై స్కూల్, స్టేట్ బ్యాంక్ సచివాలయం ఎంప్లాయిస్‌ను కలిశారు. తోట్లవల్లూరు యూనియన్ బ్యాంక్, సప్తగిరి బ్యాంక్, యూకో బ్యాంక్, హైస్కూల్, వల్లూరుపాలెం హై స్కూల్,సచివాలయం ఎంప్లాయిస్, బొడ్డపాడు యూపీ స్కూల్ ఉపాధ్యాయులను కూడా కలిసి ఓట్లు అభ్యర్థించారు. ప్రజానాట్య మండలి కృష్ణా జిల్లా అధ్యక్షులు కంభం కొండలు బాబు, జుజ్జువరపు ఏసోబు, కౌలు రైతు సంఘం నాయకులు జీవి సుబ్బారావు, కే.ప్రభుదాసు, మర్రెడ్డి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

- ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు కౌలు రైతులు, పెన్షనర్లు, అంగన్వాడి, నిరుద్యోగులు, అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పలు సమస్యలపై గత 18 ఏళ్లగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా పోరాటం జరిపామని ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు అన్నారు. గుంటూరు కృష్ణా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శుక్రవారం ఉయ్యూరులోని విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన దగ్గర్నుండి జాబ్ క్యాలెండర్‌గాని డీఎస్సీ నోటిఫికేషన్ గానీ విడుదల చేయలేదని, నిరుద్యోగులు వాటిపై ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ శాఖల్లో లక్ష 47వేల పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు. ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి నైన నన్ను, ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సమావేశంలో కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలు ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులను గ్రాడ్యుయేట్లను తమ మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు కేపి విశ్వ మోహన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎన్ లక్ష్మణరావు, ప్రజా సంఘాల బాధ్యులు వై నరసింహారావు, కే శివ నాగేంద్రం, బి రాజేష్, ఎన్ గోపాల్ ప్రేమ్ సాగర్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం : సమస్యలు పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గన్నవరం ఎన్టీఆర్ పశువైద్య కళా శాల అవరణంలో కాంట్రా క్ట్ ఉద్యోగులు ఆందోళన జరిపారు. రాష్ట్ర ప్రభు త్వం ఎన్నికల సమయంలో చేసిన వాగ్ధానం నిలుపుకో వాలని కోరారు. ఈ కాలేజీ ఏర్పడి 25 సంవత్సరాలు గడిచిందని, ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వ నియామకం చేపట్టలేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వం ప్రవేట్ ఏజెన్సీలను అప్పచెప్పాలని పావులు కదుపుతున్నారని విమర్శించారు. కాబట్టి ఈ ప్రవేటికరణ వద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్, జాయింట్ ప్రెసిడెంట్, సెక్రటరీ పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-చల్లపల్లి : సొంత భూమి గల రైతులు తమ పొలం ఉన్న రెవెన్యూ గ్రామ పరిధిలోగల రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని జి.సాయి సింధు తెలిపారు సొంత భూమి గల రైతులకు ఆధార్ తరహా యూనిక్ ఐడి నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు.కావున రైతులు ఆయా గ్రామాల్లో గల రైతు సేవ కేంద్రాలలో భూమి పాస్ పుస్తకం జిరాక్స్ లేదా 1 బి, ఆధార్ కార్డు, ఆధార్ నెంబర్ లింక్ అయిన ఫోను తీసుకెళ్లి రైతు విశిష్ట సంఖ్య (ఫార్మర్ రిజిస్ట్రీ) 11 అంకెల యూనిక్ ఐడి నమోదు చేయించుకోవాలని సూచించారు. **ప్రజాశక్తి-నందివాడ** : మండలం లోని పెదలింగాల గ్రామంలో వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించిన విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి భానుప్రకాష్ మాట్లాడుతూ సొంత భూమి గల రైతులు తమ పొలం ఉన్న రెవెన్యూ గ్రామ పరిధిలోగల రైతు సేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు.



మోపిదేవి మండలంలో...



మొవ్వ మండలంలో...



ఉంగుటూరు మండలంలో..



ప్రకృతి వ్యవసాయంపై అమెరికా బృందం ప్రశంస

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్నవరం) : వాతావరణ మార్పు, సుస్థిరత, వ్యవసాయ రంగ నిపుణులతో కూడిన అమెరికాకు చెందిన పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ బృందం తమ రెండు రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా శుక్రవారం కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలో పర్యటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య (ప్రకృతి వ్యవసాయం) కార్యక్రమాన్ని పరిశీలించేందుకు బాపులపాడు మండలంలోని కానుమోలు, కాకులపాడులో తిరిగారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన పెగాసస్ క్యాపిటల్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్, సిఇఒ క్రేగ్ కోగట్ ,టీమ్ సభ్యులు మాట్లాడుతూ ప్రకతి వ్యవసాయంలో ఇటువంటి నూతన ఆవిష్కరణలు ఎక్కడా చూడలేదన్నారు. ఈ సందర్భంగా బందం తొలుత కనుమోలు గ్రామంలోని అనురాధ నిర్వహిస్తున్న 365 డేస్ కిచెన్ గార్డెన్ ను సందర్శించింది. అనంతరం అమెరికా బృంద సభ్యులు మాట్లాడుతూ బహుళ పంటల సాగులో రాష్ట్రం చూపుతున్న మక్కువ ప్రశంసనీయమన్నారు.

ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లా కేంద్ర మైన మచిలీపట్నం నగరంలోని స్థానిక లక్ష్మీ టాకీస్ సెంటర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ ఎదురుగా అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డి క్లోట్లును నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలరాజు మాట్లాడుతూ ప్రధాన రహదారి పక్కన అక్రమంగా బడ్డీ ఏర్పాటు చేసుకోవడం కాకుండా ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారని, దీనివల్ల ప్రమాదాలు చోటు చేసుకుంది కాబట్టి బడ్డీలను వెంటనే తీసేయాలని రెండు నెలల క్రితం యజమానులకు నోటీసులు ఇచ్చిన స్పందించకపోవడంతో తొలగించామన్నారు. ఇదే కాక నగరంలో ప్రభుత్వ స్థలాలు, రోడ్ల మార్జిన్ లు ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన నిర్మాణాలను కూడా త్వరలో తొలగిస్తామని స్పష్టం చేశారు. అర్ధతరంగా బడ్డీ కోట్లు తొలగించడంతో తమ జీవన ఉపాధి దెబ్బతింటు ందని యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు.



జగన్ ఐ ప్యాక్ డ్రామాలు ప్రజలు నమ్మరు : మంత్రి

ప్రజాశక్తి - గుడివాడ : జగన్ ఐ ప్యాక్ డ్రామాలు ప్రజలు నమ్మరని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఏపిఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి మంత్రి రవీంద్ర మాట్లా డుతూ అధికారంలో ఉండగా చేసిన తప్పులను ప్రశ్నిస్తామనే భయంతోనే జగన్ అసెంబ్లీకి రావడం లేదన్నారు. పోలీసులను బెదిరించే నీచ రాజకీయాలకు జగన్ తెర లేపాడన్నారు. మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో సీఎం చంద్రబాబు మాట్లాడారని, ఎన్నికల కోడ్ ఉందని అధికారులు చెప్పినా రాజకీయ స్వార్థానికే మిర్చి యార్డ్‌కి జగన్ వెళ్ళాడన్నారు. మాజీ మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలను పట్టించుకోవలసిన అవసరం లేద న్నారు. ఈ సమావేశంలో ఏపీ గ్రంధాలయ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జనసేన జిల్లా కన్వీనర్ బండి రామకష్ణ, నాయకులు దావులూరు సురేంద్ర బాబు, బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని బాబ్జి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

పదివేల మందికి అన్న సమారాధన

ప్రజాశక్తి-ఉయ్యూరు : వీరమ్మ తిరునాళ్లలో భక్తులకు శుక్రవారం భారీ అన్న సమారాధన చేశారు. ఆలయక మిటీ ఆధ్వర్యంలో రెండో రోజు అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు పెద్దయెత్తున అన్నసమారాధన చేయగా కమిటీ సభ్యులు ప్రసాద్, నెరుసు వీరకుమార్, బాలకష్ణ, శ్రీనివాస్ ఇతర సభ్యులు పాల్గొని సేవలందించారు. పొడవాటి క్యూల్లో నిలుచుని అమ్మ వారి ప్రసాదం అందుకున్నారు. అన్న సమారాధన పట్ల పలువురు భక్తులు కమిటీ సభ్యులను అభినందించారు.అలాగే వీరమ్మకు తిరునాళ్లలో మహిళలు పసుపుకుంకుమ, చీర,సారె సమర్పిస్తున్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : న్యాయవాద వృత్తి స్వీయ నియంత్రణకు అవసరమైన, దాని స్వయం ప్రతిపత్తిని, స్వాతంత్ర భావనను కూల్చివేసేందుకు న్యాయవాదుల 2025 సవరణ బిల్లను వ్యతిరేకిస్తూ తిరువురు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు శుక్రవారం విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వాకధాని లక్ష్మీనారాయణ, షేక్ గౌసు ద్దీన్, న్యాయవాదులు మునగాల అప్పారావు, బి.ఎల్ గణేష్ సింగ్, ఎం.రామ్మోహన్ రాజు, చింతల వెంకటరెడ్డి పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** భారత ప్రభుత్వం అమలు చేయదలచిన అడ్వకేట్స్ (అమెండమెంట్స్) యాక్ట్ - 2025ను నిరసిస్తూ శుక్రవారం న్యాయవాదులు కోర్ట్ విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అన్నెపాగ సుందరరావు, యర్రమాస్ ధనుంజయుడు, బద్దుల వెంకటరామయ్య, వి.మధు, ఆరెపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **మైలవరం :** న్యాయవాదుల హక్కులను హరించే న్యాయవాదుల చట్టం 1960ను సవరణ చేసి నూతన బిల్లును కేంద్రం ప్రవేశపెట్టాలని చర్యలను వ్యతిరేకిస్తూ మైలవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం తమ విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా మైలవరం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీటి. కిషోర్, సీనియర్ న్యాయవాదులు బుద్ధవరపు వెంకటరావు, మాదు ఆంజనేయులు, రావూరి రమేష్ బాబు, పి శ్రీనివాసరావు, శరత్ బాబు, తనూజ్, దినేష్, సుజిని, ఓర్సు శ్రీనివాసరావు, జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేయాలి

విజయవాడ : కృష్ణా మిల్క్ యూనియన్‌పై తాను చేసిన ఆరోపణలను నిరూపించలేక పోతే ఫ్యాక్టరీ ఆవరణలో ఉరివేసుకుంటానని జి.కొండూరు మండలం కవులూరు గ్రామ పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు తాడికొండ రమేష్ బాబు పాలకవర్గానికి సవాల్ చేశారు. విజయ డైరీలో జరిగిన మోసాలు ఆకతవకలపై సిబిఐ ఎంక్వయిరీ జరిపించాలని డిమాండ్ చేశారు. పాలకవర్గం అవినీతిపై విచారణ జరిపి చైర్మన్ చలసాని ఆంజనేయులుని పదవి తొలగించి కాపాడాలని ఆయన కోరారు. హనుమంతరాయ గ్రంథాలయహాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తాడికొండ రమేష్ బాబు మాట్లాడుతూ తాను చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. మండల జానకి రామయ్య ఎన్నో కష్టనష్టాలకోర్చి మిల్క్ యూనియన్ లాభాల బాటలో నడిపేందుకు అహర్నిశలు కృషి చేసారన్నారు. ఇటీవల నిర్వహించిన వజ్రోత్సవాల్లో మీటింగ్ లో నష్టాల్లో ఉన్న మిల్క్ యూనియన్‌ను తాము లాభాల్లో నడిపించినట్లు పాలకవర్గం ప్రకటించడాన్ని తప్పు పట్టారు. రైతులకు బోనస్ చెల్లించకుండా మోసగించారని ఆయన మండిపడ్డారు. విజయ డైరీలో జరిగిన మోసాలు ఆకతవకలపై పై సిబిఐ ఎంక్వయిరీ జరిపించాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయాధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గరికపాడు వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం మండల, వ్యవసాయ డివిజనల్ స్థాయి వ్యవసాయ అధికారులకు ఫిబ్రవరి నెల శిక్షణ, సందర్శన కార్యక్రమం జిల్లా వ్యవసాయ శాఖ, గరికపాడు వ్యవసాయ పరిశోధన స్థానం సంయుక్తంగా ఫిబ్రవరి నెల శిక్షణ, సందర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గరికపాడు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. ఎస్.కృష్ణంరాజు, జిల్లా వ్యవసాయ అధికార ప్రతినిధిగా ఎం.రత్నశ్రీ, కృషి విజ్ఞాన కేంద్ర, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్. కె.అచ్యుత్ రాజు వ్యవసాయ శాఖ అధికారులు, ఆరు వ్యవసాయ డివిజన్ నుంచి విచ్చేసిన సహాయ వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం.రత్న శ్రీ ప్రస్తుతం జిల్లాలోని వరి, మొక్కజొన్న, మిరప, జొన్న, పంటల విస్తీర్ణం, వాటిలోని ప్రధాన పురుగులు, చీడలు ఉధృతి గురించి వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో వరిలో ప్రధాన సమస్య అయిన కాండం కుళ్ళు తెగులు, అగ్గి తెగులు, మిరపలోని వడలు తెగులు, నివారణ చర్యలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్. బి.వెంకటేశ్వర్లు మొక్కజొన్న కత్తెర పురుగు జీవిత చక్రం, దాని నివారణ చర్యలు గురించి వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.అచ్యుతరాజు జిల్లాల్లో ఆపరాల పంట సాగు ఆవశ్యకత, ఆపరాల పంటల విస్తరణ, విస్తరణ పెంపుదలకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావుకు మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటర్లకు బ్యాలెట్ నమూనా పత్రాన్ని చూపిస్తూ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ్ రావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోటా రవికుమార్, దంతాల వెంకటేశ్వర్లు, జె వెంకటరావు దంతాల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** ఉద్యోగ ఉపాధ్యాయ అధ్యాపక, చిరు, నిరుద్యోగ, కార్మిక కర్షక ప్రజా చైతన్య గొంతుక ప్రభుత్వం ఏదైనా సమస్యలపై నిలదీసి మాట్లాడే వ్యక్తి ప్రముఖ విద్యావేత్త మేధావి కృష్ణ గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కెఎస్.లక్ష్మణరావును అత్యధిక మెజారిటీతో మేధావులు సభకు మేధావుల్ని పంపిద్దామని పట్టభద్రులకు సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం.మహేష్ పిలుపునిచ్చారు. పశ్చిమ ఇబ్రహీంపట్నంలో డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. పశ్చిమ ఇబ్రహీంపట్నం ఉదయం డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించిన డివైఎఫ్ఐ యూత్ మండల కార్యదర్శి ఎస్‌కె.బాషా, రషీద్ తదితరులు పాల్గొన్నారు. **విజయవాడ రూరల్ :** మండలం రామవరప్పాడులో ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కే.ఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ బ్యాలెట్ నమూనా పత్రాన్ని విడుదల చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.వి.కృష్ణా, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, మండల కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, నాయకులు రమేష్ పాల్గొన్నారు. **విజయవాడ :** కెఎస్.లక్ష్మణరావుని ప్రథమ ప్రాధాన్యత ఓటువేసిగెలపించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టి జయచంద్ర, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు, సిఐటియు సెట్రల్ సిటి సహాయ కార్యదర్శి వై సబ్బారావు విజయవాడ మాచవరం ప్రాంతంలో తమరిమల్లి ఖార్జున చంద్రమతి ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ఎలిమెంట్రీ స్కూల్, నవోదయ, మహాత్మాగాంధీ ప్రైవేట్ హైస్కూళ్లలోని టీచర్లను కలిశారు. **గంపలగూడెం :** కెఎస్ లక్ష్మణ్ రావును గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. మేడూరులో నిర్వహించిన ప్రచారంలో ఓటర్లను కలిసి, కెఎస్ లక్ష్మణరావు సాధారణ ప్రజల మనిషిని గుర్తు చేశారు. బూర్జువా నాయకులకు ఓట్లు వేస్తే వచ్చేదేమీ లేదని తెలిపారు. **తిరువూరు :** నీతీ, నిజాయితీతో పాటు నిబద్ధత కలిగిన విద్యావేత్త, మేధావి అయిన కె.ఎస్.లక్ష్మణరావును ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టబద్రు ల నియోజకవర్గ శాసన మండలికి ఎమ్మెల్సీగా తిరిగి ఎన్నుకోవాలని అఖిలభారత న్యాయవా దుల సంఘం (ఐలు) నాయకులు ఎం.నాగేంద్ర ప్రసాద్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తిరు వూరు పట్టణంలో వివిధ ప్రజా సంఘాల నాయ కులతో కలిసి ఆయన తిరువూరు పట్టణంలోని వివిధ కోచింగ్ సెంటర్లలో, గ్రంథాలయాల్లో, పోలీ సు కానిస్టేబుల్ కోసం, ఎస్సైల కోసం, ఉపాధ్యా యుల కోసం సిద్ధమవుతున్న పట్టభద్రులైన ఓట ర్లను కలిసి ఓట్లను అయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమం లో రిటైర్డ్ ఉద్యోగస్తులు, పసుపులేటి సీనయ్య, పాకాల రామకష్ణ, కడి మి పాపారావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆకుల రవి, బలగా ని వెంకటేశ్వరరావు తది తరులు పాల్గొన్నారు..



విజయవాడ రూరల్‌లో బ్యాలెట్ నమూనా పత్రాన్ని విడుదల చేస్తున్న డి.వి.కృష్ణ, తదితరులు



జగ్గయ్యపేటలో ప్రచారం



ఇబ్రహీంపట్నంలో...



తిరువూరులో...

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌లో రీ వెరిఫికేషన్ క్యాంపును శుక్రవారం వైసిపి నాయకులతో కలిసి నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వికలాంగులు, వృద్ధులు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించి వారికి తాగునీరు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. వికలాంగులు, వృద్ధులు తీవ్ర ఎండ ప్రభావంతో తాగునీరు సరైన అల్పాహారం దొరక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏదేమైనా రీ వెరిఫికేషన్ క్యాంపునకు వచ్చిన వికలాంగులకు, వృద్ధులకు వీల్‌చైర్లు ఏర్పాటు చేసి, కేవలం ఒక్క డాక్టర్ కాకుండా ఇద్దరు, ముగ్గురు డాక్టర్లతో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల లోపల పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వికలాంగుల విభాగ అధ్యక్షులు పూర్ణకంటి బాబురావు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట ఆర్యవైశ్య ప్రముఖులు, న్యాయవాది రాయపూడి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా శ్రీ వాసవి సేవా సమితి జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీరంగం రామయ్య దంపతులకు నిత్యావసర వస్తువులను రాయపూడి శ్రీనివాసరావు, సుధా దంపతులు అందజేసి కేక్ కట్ చేశారు. అనంతరం దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాకరపర్తి సోమేశ్వరరావు, జిల్లా సెక్రటరీ పెనుగొండ రామకృష్ణ, జిల్లాట్రెజరర్ కంభంపాటి రవి కుమార్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వాసా నాగమణి ఉన్నారు.

మహాశివరాత్రి మహోత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - వత్సవాయి : లింగాల గ్రామంలో పవిత్ర మునేటి ఒడ్డున వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజామున 3 గంటల నుండి స్వామివారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి దేవాలయం వద్ద మహా అన్నదాన కార్యక్రమం జరుగును. ఈ మహా అన్నదాన కార్యక్రమానికి విరాళాలు ఇవ్వదలచిన దాతలు వస్తురూపేణా గాని, ధన రూపేణా గాని, ధాన్యరూపమైన గాని ఇవ్వవచ్చన్నారు. అన్నదాన వివరాలకు 9849857276 నెంబర్‌కి సంప్రదించగలరు. సాయంత్రం 7 గంటల నుండి స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగ రంగ వైభవంగా జరుగును. మన శివాలయం ప్రాంగణంలో సినీ సంగీత విభావరి, జానపద పాటలు నత్య ప్రోగ్రాం జరుగుతుందన్నారు. ఈ శివరాత్రి తిరునాళ్లకు యాత్రికుల సౌకర్యార్థం పవిత్ర మునేటి ఒడ్డున జల్లు స్నానం ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. పిండ ప్రధానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ మహా శివరాత్రి మహోత్సవం సందర్భంగా మన దేవాలయ ప్రాంగణంలో యాత్రికులు ఆనందానికి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు ఈ ఎగ్జిబిషన్‌లో జెంటివీల్, రన్నింగ్ ట్రైన్, బైక్ గేమ్ కొలంబస్, ఎయిర్ బౌన్సర్, ధూమ్ బైక్, స్కార్పియో, 3 ఇన్ వన్ మరెన్నో ఆట వస్తువులు మీ ఆనందానికై ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యుద్ఘాతంతో బాలుడు మృతి

ప్రజాశక్తి - మైలవరం : విద్యుద్ఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వెల్వడం గ్రామ శివారు ఇటుక బట్టీల వద్ద గురువారం అర్ధరాత్రి జరిగింది. సేకరించిన వివరాలు ప్రకారం బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెద్ద పాలెం గ్రామానికి చెందిన ఎందుమూరి రవి రెండు నెలల క్రితం తోలుకోడు రోడ్డులో ఉన్న ఇటుక బట్టీలలో పని నిమిత్తం కుటుంబంతో కలిసి వచ్చాడు. బట్టీల వద్ద పాకలు వేసుకొని నివసిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి సమయంలో టేబుల్ ఫ్యాన్ వైర్లు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రావటంతో నిద్రిస్తున్న రవి మేల్కొని కేకలు వేయగా మిగతా కుటుంబ సభ్యులు అప్రమత్తమయ్యారు. ఈక్రమంలో కుమారుడు బన్ను ఫ్యాన్ వద్దకు రాగా ఊడిపోయి ఉన్న వైర్లు తగిలి విద్యుతంతో పడిపోయాడు. కుమారుడని కాపాడే ప్రయత్నంలో తండ్రి కూడా గాయపడ్డాడు. క్షతగాత్రులను మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే బన్ను మతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రవిని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : అంగన్వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ కొండపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులు పాటు కొనసాగింది. జ్ఞాన జ్యోతి పేరిట ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి అమలు చేస్తున్న సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్ (ఎస్ ఏ ఎల్ టి) కార్యక్రమాన్ని గురువారం ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ రత్న శ్యామ్ బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్ సిహెచ్ మాధవి, జి రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు నాగబాబు బి వాసంతి ప్రధమ కన్సల్టెంట్ గోపికృష్ణ పాల్గొన్నారు.

వీవర్స్ అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి - కంచికచర్ల : వైసిపి జిల్లా వీవర్స్ వింగ్ అధ్యక్షునిగా తంగెళ్లమూడి రామారావు నియమితులయ్యారు. వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకంలో భాగంగా కంచికచర్లకు చెందిన వైసిపి నాయకులు తంగెళ్ళమూడి రామారావును వీవర్స్ వింగ్ అధ్యక్షులుగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన జారీ చేసింది. పలువురు రామారావును అభినందించారు.

వైసిపి మండలాధ్యక్షుని నియామకం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలంలో గుమ్మడిదురు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు పొన్నం కోటేశ్వరరావుని మండల వైసిపి అధ్యక్షుడిగా నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు నేతృత్వంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీ సంఘాల అధ్యక్షులు మార్కపూడి గాంధీ, రాష్ట్ర బీసీ విభాగ కార్యదర్శి బత్తుల రామారావు, గ్రామ సర్పంచ్ నక్క కమలమ్మ సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రేమూరి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

హెల్మెట్, సీట్ బెల్టుతో ప్రమాదాల నివారణ : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : వాహన చోదకులు హెల్మెట్, సీట్ బెల్టు ధరిస్తే చాలావరకు రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చుని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ వారి చాంబర్లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. రోడ్డు ప్రమాదాల స్థితిగతులు, డ్రంక్ అండ్ డ్రైవ్, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ కేసులు, రహదారులపై బ్లాక్ స్పాట్లకు తీసుకున్న చర్యలు, రహదారి భద్రత అవగాహన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025 జనవరి నెలలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో 90 రోడ్డు ప్రమాదాలు జరగడం, వాటిలో 41 మరణాలు సంభవించటం, 76 మంది గాయాలపాలవడం ఆందోళనకరంగా ఉందన్నారు. ప్రతిఒక్క వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్టు తప్పనిసరిగా ధరించే విధంగా పోలీసులు కఠినంగా వ్యవహరించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలోని జాతీయ రహదారులపై ఏఐ పవర్ సిసి టీవీల సాంకేతిక పరిజ్ఞానంతో అధిక వేగంతో వెళ్లే వాహనాలను గుర్తించడం, అదేవిధంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనచోదకులను గుర్తించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని, అట్టివారికి కఠినంగా జరిమానాలు విధించాలని సూచించారు. అదేవిధంగా నగరంలోని అన్ని పశువుల కొమ్ములకు రేడియం పెయింట్స్ వేయించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలు జరగకుండా రాత్రి వేళల్లో వాహన చోదకులు వాటిని సులువుగా గుర్తించేందుకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో జిల్లా రవాణా అధికారి బి ఎస్ ఎస్ నాయక్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎల్ సిద్ధిక్, నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, రహదారులు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లోకేష్, డిఎంహెచ్వో డాక్టర్ శర్మిష్ఠ, జాతీయ రహదారులు, పోలీసు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ



క్రమబద్ధీకరణపై మాట్లాడుతున్న ట్రాఫిక్ సిబ్బంది

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

ప్రజాశక్తి - గుడివాడ : రోడ్డు మార్జిన్‌లో ఉండే ఫ్రూట్స్ షాపులు క్రమబద్ధీకరించుకోవాలని ట్రాఫిక్ ఎస్.ఐ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఎస్పి గంగాధర్ ఆదేశాలతో గుడివాడ డిఎస్పి ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో 1,2 టౌన్ సిఐల పర్యవేక్షణలో ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాదరావు రోడ్డు మార్జిన్ ఫ్రూట్ షాప్స్ క్రమబద్ధీకరణ గురించి అవగాహన కల్పించారు. చిరు వ్యాపారుల బళ్లను క్రమ పద్ధతిలో ట్రాఫిక్ సమస్యలకు ఎటువంటి అటంకంగా ఉండకూడదన్నారు. ట్రాఫిక్ పోలీస్ సూచనలు సలహాలు పాటిస్తూ క్రమ పద్ధతి ప్రకారం వ్యాపారం చేసుకోవాలన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎంపి

ప్రజాశక్తి-విజయవాడ : పార్లమెంట్ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) శుక్రవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లాకు పుష్పగుచ్చం అందించటంతో పాటు శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహుకరించారు.

ఘనంగా ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం బుద్ధవరం గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి ప్రథమ వార్షికోత్సవ మహోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. గుడిమెళ్ల దిలీప్ కుమార్ ఆచార్యుల సమక్షంలో ఉదయం స్వామివారి పంచామత అభిషేకం, నవరసాభిషేకం, సింధూరాభిషేకం, పుష్పాభిషేకాలు వేడుకగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం లక్ష తమలపాకులతో సహస్రనామ గంధ సింధూర పూజ నిర్వహించి, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ వేడుకల్లో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకట్రావును ఆలయ కమిటీ, అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : డిఆర్ఓ

పిఎం సూర్యఘర్‌పై అవగాహన

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : విద్యుత్ బిల్లుల భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కలిగి ఉండి ఉద్యోగులను ప్రోత్సహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు అన్నారు.ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం పై ఉద్యోగులకు అవగాహన కల్పించి ప్రోత్సహించడంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో గ్రంథాలయ సంస్థ, ఫైర్ డిపార్ట్మెంట్ ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఆర్ఓ చంద్రశేఖర రావు మాట్లాడుతూ అతి తక్కువ ఖర్చుతో లబ్దిదారులు ఇంటి పై సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తయారైన విద్యుత్‌ను ఉచితంగా గహ అవసరాలకు వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లింపులు చెల్లించవలసిన అవసరం ఉండదన్నారు. ఇంటి కప్పుపై ప్రభుత్వ రాయితీతో పాటు అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకుని కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సౌర విద్యుత్‌ను వినియోగించుకోవడం ద్వారా కాలుష్య రహితపర్యావరణ హిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని డిఆర్ ఓ కె.చంద్రశేఖర రావు పేర్కొన్నారు.మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి సాయిబాబు,మాట్లాడుతూ ఈ పథకం పెద ,మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని కాబట్టి వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సిహెచ్. వి. ఆంజనేయ ప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ వి.రవికుమార్ ఉద్యోగులు ఉన్నారు.




'నా ఆరోగ్యం నా అలవాట్లు'పై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగ అధిపతి రత్నకుమారి ఆధ్వర్యంలో మద్రాస్ ఆరోగ్యభారతి సహకారంతో 'నా ఆరోగ్యం నా అలవాట్లు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య భారతి ప్రతినిధులు మాట్లాడుతూ నిత్యజీవితంలో పాటించవలసిన ఆరోగ్య విషయాలు తీసుకోవలసిన జాగ్రత్తలు ఆచరించవలసిన విధి విధానాల గురించి వివరించారు. అదేవిధంగా విద్యార్థుల జ్ఞాపకశక్తి కోసం ఒత్తిడిని జయించడం కోసం అభ్యసించవలసిన యోగాసనాలు యోగ ముద్రల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం సందర్భంగా కళాశాల తెలుగు విభాగాధిపతి భాగ్య వేణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఉమారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు భాష అభిమాని భాషా ప్రవీణులు చిలుకూరి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్ అంకారావు ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి బి సంధ్య శ్రీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ సాహితీవేత్త, రచయిత, సరసభారతీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవ్యక్తి ఎక్కడ జన్మించినా తన మాతృభాషను మరవ రాదని, మాతృ భాషను మరిస్తే మాతృమూర్తిని మరచినట్టే అన్నారు. తెలుగుభాష పరిరక్షణకు అందరు బాధ్యతగా చేపట్టవలసిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి దినవహి ప్రసాద్, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, కృష్ణప్రసాద్, హాసన్అహ్మద్, రామనాథబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షులు డి.ఆర్.బి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉరిటి రామారావును ఘనంగా సత్కరించారు. స్థానిక ఎన్‌టిఆర్ కాలనీలోని చైతన్య భారతి విద్యానికేతన్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన 1టౌన్ సిఐ కె శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీ వివేకానంద సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఉరిటి రామారావుకు ఎంఆర్ నాగేశ్వరరావు సాహితి స్ఫూర్తి పురస్కారం 2025ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ వాకర్స్ అధ్యక్షులు డివి సత్యనారాయణ, రచయిత్రి కైకాల సుమ, మహిళా వాకర్స్ అధ్యక్షురాలు దీవెన, కార్యదర్శి ప్రతిమ, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి- చల్లపల్లి :** సమాజానికి దిక్సూచి భాష అన్న వివేకానందుని స్ఫూర్తితో యువత అస్తిత్వం, వ్యక్తిత్వం కాపాడుకుంటూ మహోన్నత తెలుగుజాతి ఖ్యాతి నిలపాలని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. శుక్రవారం చల్లపల్లిలోని వివేకానంద డిగ్రీ కళాశాల, విజయ జూనియర్ కళాశాలల 33వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడారు.



చల్లపల్లిలో బహుమతులు అందిస్తున్న బుద్ధప్రసాద్

ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను సత్కరించి నగదు బహుమతులు అందించారు. డాక్టర్ డీ.ఆర్.కే.ప్రసాద్, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కష్ణకుమారి, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, కళాశాల ప్రిన్సిపాల్స్ పెమ్మసాని రమేష్ బాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి- హనుమాన్ జంక్షన్ (గన్నవరం) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేమల్లెలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసే నివారణ అర్పించారు. ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు, మరొక తెలుగు ఉపాధ్యాయులు దీవి పార్థసారథి, సీనియర్ ఉపాధ్యాయులు కే వెంకట కుమారి, జే పద్మ, బి రాజశేఖర్ పాల్గొన్నారు

రహదారులు అధ్వానం


- సమస్యలు పట్టించుకోని ఒఎన్‌జిసి, మేఘా సంస్థలు
- వసతులు కల్పించాలని గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - నాగాయలంక : మండలంలోని వక్కపట్లవారిపాలెం గ్రామం పరిధిలో ఒఎన్‌జిసి, మేఘా ఆధ్వర్యంలో ఆయిల్ డ్రిల్లింగ్ పాయింట్ ముడిచమురు తీసుకెళ్లే భారీ వాహనాలు, ప్లాంట్ వద్ద వినియోగించే భారీ యంత్రాలు తరలించే వాహనాలతో రోడ్ల అధ్వానంగా తయారైవ్వడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చుట్టుపక్కల గ్రామస్తులు డ్రిల్లింగ్ పాయింట్ వద్ద ఆందోళనలు నిర్వహించగా సంస్థ యాజమాన్యం వక్కపట్లవారిపాలెం నుండి భావదేవరపల్లి మధ్య ఉన్న ప్రధాన రహదారిని నిర్మాణం చేపట్టనున్నట్లు శిలాఫలకాలు వేసి చేసిన ప్రకటన ఏ మాత్రం ముందుకు సాగకపోగా, ఆ సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం సైతం శిథిలం అయిపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఆయిల్ నిక్షేపాలను వెలికితీతకు ముందు ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికంగా ఉన్న వారికి మేజర్ ప్రయారిటీ కింద ఉపాధి కల్పించడం, చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటికి వాటర్ ప్లాంట్ ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనకు,గ్రామాల అభివద్ధికి కషి చేస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి ఆయిల్,గ్యాస్ వంటి నిక్షేపాలను కొల్లగొట్టుకుపోతూ గ్రామాల వైపు కన్నెత్తి చూడపోగా ఉన్న రోడ్లను, భూగర్భ జలాలను నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయిల్ నిక్షేపాలతో భూగర్భ జలాలు కలుషితమై చుట్టుపక్కల గ్రామాలలో అనేకమంది క్యాన్సర్ బారిన పడి మత్యువాత పడుతున్న ఘటనలు చూస్తున్నామని, కనీసం ఇన్ని సంవత్సరాలలో ఒక్కసారి కూడా చుట్టుపక్కల హెల్త్ క్యాంపు నిర్వహించిన పాపాన కూడా పోలేదని అంటున్నారు.

గ్రామస్తుల సహకారంతో రోడ్డు తాత్కాలిక మరమ్మత్తులు

సంక్రాంతి సమయానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి రాష్ట్రంలో గుంతల మయమైన రోడ్లు కనిపించరాదని తాత్కాలిక మరమ్మత్తులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేసినప్పటికీ సంక్రాంతి అయ్యి రెండు నెలలు కావస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉందని గ్రామస్తులు అంటున్నారు. కొంతమంది గ్రామస్తులు చొరవ తీసుకొని పలువురు ఆర్థిక సహకారంతో రోడ్లను తాత్కాలిక మరమ్మత్తులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి : అబద్ధపు హామీలతో అనుమతులు పొంది ఇక్కడ ఉన్న ఆయిల్ గ్యాస్ వంటి నిక్షేపాలను కొల్లగొడుతూ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్న చూసిచూడనట్లు వ్యవహరిస్తూ గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, హెల్త్ క్యాంపులు, స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా కషి చేయాలని కోరుతూ భావదేవరపల్లి, వక్కపట్ల వారి పాలెం, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు శుక్రవారం నాగాయలంక తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కరించకపోతే రాబోవు రోజుల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు.



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

పిబి సిద్ధార్థలో తెలుగు భాషా పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : తల్లిదండ్రులను, గురువులను గౌరవించడంతో పాటు ప్రతి ఒక్కరూ మాతృభాషను కూడా గౌరవించాలని పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేక రమేష్ అన్నారు. శుక్రవారం ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం నేతృత్వంలో విజయవాడలోని పిబి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఉయ్యూరు ఏ.జి. అండ్ ఎన్.జి. సిద్ధార్థ కళాశాల తెలుగు శాఖలు సంయుక్తంగా మాతృభాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన తెలుగు భాషా పోటీల్లో గెలుపొందిన వారికి ఆయనతో పాటు కళాపీఠం కార్యదర్శి బి.వి.ఎస్. ప్రకాష్ బహుమతులు అందజేశారు. తెలుగు పద్యాలాపన, గద్య పఠనం, అచ్చంగా తెలుగులో మాట్లాడటం, ఆంగ్లపదాలకు తెలుగు మాటలు రాయడం పోటీల్లో 300 మందికి పైగా పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తెలుగు భాషాభిమానాన్ని చాటుకున్నారు. న్యాయనిర్ణేతలు విశ్రాంత ఉప ప్రాచార్యులు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ డా.కె.బాలకష్ణ, ఉపాధ్యాయులు సీతామాలక్ష్మి, వలివేటి శివరామకృష్ణమూర్తి, తెలుగు అధ్యాపకులు డా.ఎన్.శివకుమార్, డా.పి నీరజ, గోవాడ శేషారత్నం, డాక్టర్ సశ్రీ పాల్గొన్నారు.



సాంకేతికతతోనే వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలతోనే వ్యవసాయరంగం బలోపేతమై, గ్రామీణాభివృద్ధి కల సాకారమవుతుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు డాక్టర్ ఎల్.ఎస్.మల్లయ్య అన్నారు. విజయవాడలోని పి.బి సిద్ధార్థ కళాశాల ఆర్థికశాస్త్ర విభాగం నిర్వ హణలో రెండురోజుల జాతీయ సదస్సును శుక్రవారం ఉదయం ఆయన ప్రారంభిం చారు. ఆర్టిఫి షియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్, రోబోల సహకారంతో మనదేశంలో వ్యవసాయరంగం మున్నెన్నడూ లేనంతగా ఆర్థికవ్యవస్థను ప్రభావితం చేయబోతోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, సెమినార్ డైరెక్టర్ డాక్టర్ మేకా రమేష్ మాట్లాడుతూ వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో ఆవిష్కరణల పాత్రపై రెండురోజుల సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకడమిక్ అడ్వయిజర్ ఆచార్య ఎల్ .కె. మోహన్‌రావు, డీన్ ఆచార్య రాజేష్ సి. జంపాల, ఆచార్య నాగార్జున వర్సిటీ ప్రొఫెసర్ కె. మధుబాబు, కళాశాల డైరెక్టర్ వి. బాబురావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. రోహిణి కుసుమ, డా. సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు. ఉభయ రాష్ట్రాల నుంచి పలువురు హాజరై పత్రాలు సమర్పించారు.

ఆటో కార్మికులు క్రమశిక్షణతో ఉండాలి

జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్



ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ సిఐటియు రైల్వేస్టేషన్ 19వ మహాసభ శుక్రవారం గాంధీనగర్ లోని హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగింది. మహాసభకు ముందు సి.ఐ.టి.యు జెండావిష్కరణ విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్ గారు పాల్గొని మాట్లాడుతూ విజయవాడ నగరంలో ఆటోలు నడుపుతున్న ఆటో కార్మికులు క్రమశిక్షణతో ఉండాలని ప్రతి ఒక్కరు లైసెన్సు, కాకి యూనిఫామ్, బండి కాగితాలు సక్రమంగా ఉండాలని సూచించారు ఎవరికైనా ప్రమాదాలు జరిగితే తోటి కార్మికులు ఆ కార్మికుడు ప్రాణాలు కాపాడి ప్రోత్సాహాలు పొందాలని సూచించారు. ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మా దష్టికి తీసుకువస్తే అవకాశం ఉన్నంత వరకు పరిష్కరిస్తామని హామీని ఇచ్చారు. విజయవాడ నగరపాలక సంస్థ మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సి.హెచ్ బాబురావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఫలితంగా మోటార్ రంగం తీవ్ర సమస్యలు ఎదుర్కొంటుందని సమస్యల పరిష్కారానికి ఆటో కార్మికులంతా ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆటో కార్మికుల ఆదాయం తగ్గిపోయి వారి కుటుంబాలను గడపడమే కష్టంగా మారిందని బుడమేరు ముంపు కారణంగా ఇప్పటికి నష్టపోయిన ఆటో కార్మికులకు నష్టపరిహారం అందించడంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని తెలిపారు. ఈ మహాసభలో విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు గౌరవ అధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, ప్రశాంతి హాస్పటల్ జనరల్ లాపెరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి, ఎ. ఉదయ శివప్రసాద్ ఎం.వి.ఐ ఇన్స్పెక్టర్, విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు, సెంట్రల్ సిటీ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి ఎం.వి సుధాకర్, సెంట్రల్ సిటీ ఆటో వర్కర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు,తూర్పు పశ్చిమ సిటీల ఆటో వర్క యూనియన్ ప్రధాన కార్యదర్శులు బి.రూబెన్ కుమార్, ఎస్.డి కరిముల్లా తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం 33. మందితో నూతన కమిటీ ఏర్పడింది రైల్వే స్టేషన్ ఏరియా ఆటో వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎస్.కె దుర్గావళి, అధ్యక్ష కార్యదర్శులుగా ఎ.వి రెడ్డి, డి. కోటయ్య, ఉపాధ్యక్షులు ఎస్కే రఫీ, కోరుకొండ శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు యం. ప్రభుదాసు, ఎస్కే నాగూర్, ఆర్. సుబ్బరాజు ఎన్నికయ్యారు.

నగరంలో ప్రారంభమైన 'హైలైఫ్ ఎగ్జిబిషన్'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సృజనాత్మక ఫ్యాషన్‌లు, ట్రెండింగ్ డిజైనర్ దుస్తులు, ప్రత్యేకమైన జీవనశైలి ఉత్పత్తులు, ఆభరణాలు మరెన్నో ప్రదర్శిస్తూ హై లైఫ్ ఎగ్జిబిషన్ నగరంలోని హోటల్ నోవాటెల్‌లో శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా హైలైఫ్ ఎగ్జిబిషన్ ఎమ్‌డి పి.డొమినిక్ మాట్లాడుతూ ఇది వినూత్నమైన ప్రదర్శన అని, డిజైనర్ ఫ్యాషన్‌లు, ట్రెండీ ఫ్యాషన్ వేర్, వెడ్డింగ్ ఫ్యాషన్‌లు, జ్యువెలరీ, బ్రైడల్ ఫ్యాషన్ ఎసెన్షియల్స్, ఫ్యాషన్, జీవనశైలి ఉత్పత్తులు వంటి ప్రత్యేక ప్రదర్శనలను ఇది కలిగి ఉందన్నారు .ఫ్యాషన్ డిజైనర్ల నుండి తాజా కలెక్షన్, ఫ్యాషన్ లేబుల్‌లు మరిన్ని ఇక్కడ ప్రదర్శించనున్నామని అన్నారు. ఫ్యాషన్ షాపింగ్, ఎక్స్‌క్లూజివ్ వెడ్డింగ్ షాపింగ్, బ్రైడల్ ఫ్యాషన్‌లు, ఆభరణాలు, ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ కోసం రెండు రోజుల హై లైఫ్ ఎగ్జిబిషన్



నోవాటెల్ విజయవాడ వరుణ్ హోటల్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు జరుగుతుందని అన్నారు.

ఫ్లిప్‌కార్ట్ టాబ్లెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రముఖ ఇ-కామర్స్ మార్కెట్‌ప్లేస్‌లలో ఒకటైన ఫ్లిప్‌కార్ట్ ఈ సంవత్సరం ఫ్లిప్‌కార్ట్ టాబ్లెట్ ప్రీమియర్ లీగ్ 2025 (టిపిఎల్ 2025) యొక్క మొదటి ఎడిషన్‌ను ప్రారంభించినట్లు ఆ సంస్థ ప్రతినిధి కె.ఈశ్వర్ తెలిపారు. నగరంలోని ఫ్లిప్ కార్ట్ షోరూలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. 'స్క్రీన్ బడా, సీన్ బడా' అనే నేపథ్యంతో, వినోదం, విద్య, ఉత్పాదకత టాబ్లెట్ అమ్మకాలను ప్రారంభించినట్లు తెలిపారు. 2023 - 2024లో ప్రధాన క్రికెట్ సీజన్లలో టాబ్లెట్ శోధనలు 16-18 శాతం పెరిగాయని ఫ్లిప్‌కార్ట్ డేటా చూపిస్తుందని, ఈ ట్రెండ్‌ను గుర్తించి, టిపిఎల్ 2025 రాబోయే క్రికెట్ ఈవెంట్‌లతో సమానంగా ఉండేలా వ్యూహాత్మకంగా షెడ్యూల్ చేయబడిందని అన్నారు. ఫ్లిప్‌కార్ట్ టాబ్లెట్ ప్రీమియర్ లీగ్ 2025లో సామ్‌సంగ్, లెనోవో, యాపిల్, రియల్ మీ, వన్ ప్లస్, రెడ్ మీ, ఎంఐ, పోకో, ఇన్ఫినిక్స్ వంటి అత్యధికంగా అమ్ముడైన బ్రాండ్‌లు ఉంటాయని తెలిపారు.

అగ్రహారం బ్రిడ్జికి మరమ్మతులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట పట్టణం నుంచి ముక్త్యాల వెళ్ళే దారిలో అగ్రహారం బ్రిడ్జి మరమ్మతు పనులను కౌన్సిలర్స్‌తో కలిసి శుక్రవారం ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పరిశీలించారు. రెండు నెలల క్రితం కురిసిన అకాల వర్షాలకు వరదలు సంభవించి బ్రిడ్జి, రోడ్డు పాడైపోయిన సంగతి తెలిసిందే. 15 రోజుల క్రితం ఎంఎల్ఎ రాజగోపాల్ అక్కడ పరిస్థితులు గమనించి రానున్న మహా శివరాత్రి పర్వదినాన్నీ పురస్కరించుకుని వేల మంది యాత్రికులు ఆ బ్రిడ్జిపై నుంచి ప్రయాణించే అవకాశం ఉందని, కెసిపి యాజమాన్యం వారితో మాట్లాడి సిఎస్ఆర్ నిధుల ద్వారా రోడ్డు మరమ్మతులు శుక్రవారం పూర్తి చేసినట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో బ్రిడ్జికి ఇరువైపులా ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేస్తామని, ముక్త్యాల పరిధిలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు గొట్టే నాగరాజు, నకిరకంటి వెంకట్, పేరం సైదేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లెల కొండయ్య, దువ్వల రామకృష్ణ, కాటగాని నరసింహారావు, గుండ్ల కష్ణారావు, వడేఘర్ ప్రకాష్, అనుమాల వేదాద్రి, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శామ్‌సంగ్ ఆర్ అండ్ డి ఇన్‌స్టిట్యూట్ అధ్వర్యంలో, గీతా శిశు శిక్షణ సంఘ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్, మైసూరులో శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ గ్లోబల్ సిటిజన్‌షిప్ ప్రోగ్రామ్, శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్‌ను ప్రారంభించింది అని సంస్థ రీజినల్ ఇన్చార్జ్ కె.ప్రసాద్ రాజ్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంలో కొత్త తరం మహిళా నాయకులను ప్రోత్సహించడానికి శామ్‌సంగ్ అచంచలమైన నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు.. సెప్టెంబర్ 2022లో ప్రారంభించిన ఎస్ఐసి కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా, కోడింగ్, ప్రోగ్రామింగ్‌తో సహా ప్రధాన సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించిన విస్తృతమైన పాఠ్యాంశాలను కలిగి ఉందన్నారు. పేర్లను నమోదు చేసుకున్న విద్యార్థులు తరగతి గదిలో నిపుణులైన ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ పొందడానికి, శ్రీ-బి, జీఎస్ఎస్ఎస్ ఇన్‌స్టిట్యూట్ మార్గదర్శకుల గైడెన్స్‌లో వినూత్న ప్రాజెక్టులపై పనిచేయడానికి అవకాశం పొందుతారని తెలిపారు. వివరాలకు గీత శిశు శిక్షణ సంస్థలో సంప్రదించవచ్చని తెలిపారు.

దేవస్థానాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ ఉప కమిషనర్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని ముక్త్యాల గ్రామంలో గల శ్రీ భవానీ ముక్తేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఈ నెల 23 నుండి మార్చ్ 3 వరకు జరుపు మహా శివరాత్రి-2025 ఉత్సవాల సందర్భంగా దేవదాయ శాఖ ఉప కమిషనర్ డి.ఎల్.వి.రమేష్ బాబు శుక్రవారం దేవాలయం సందర్శించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26 శివరాత్రి రోజు నిర్వహించే స్వామి కళ్యాణానికి విచ్చేసే యాత్రికులకు కల్పించిన సౌకర్యాలు, చేసిన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మరికొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ పి.సీతారామయ్య, నందిగామ డివిజన్ తనిఖీదారు పవన్ కళ్యాణ్, దేవదాయ శాఖ ఇతర అధికారులు, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త తరుపున ఎజిఎం పి.రాంప్రసాద్ పాల్గొన్నారని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న చందా అక్షయ నేషనల్ మెరిట్ కం మీన్స్ ఆఫ్ స్కాలర్షిప్‌కు ఎంపిక కావడం సంతోషకరం మని పాఠశాల ప్రిన్సిపల్ కం హెడ్మాస్టర్ ఎ.లక్ష్మి విద్యార్థినిని అభినందించారు. బాలికలు బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు, ప్రఖ్యాతులు మరెన్నో తీసుకురావాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థి కూడా నేషనల్ స్కాలర్షిప్ పరీక్షకు పోటీపడి చదవాలని మెరిట్ సాధించాలని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కల్పన, ఈశ్వరి, వాణి, షకీలా, సుజాత, జయవాణి, కరుణాకర్ రెడ్డి, హనుమంతరావు, శివయ్య, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.